# వికసించిన విద్యాకుసుమాలు

## టెన్త్ ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కుసుమాలు వికసించాయి. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పేద, సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులెందరో ప్రతిభ చూపారు. చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు దీటుగా రాణించారు. తల్లిదండ్రుల కలలను నిజం చేశారు. పాఠశాలల ప్రతిష్టను ఇనుమడింపజేశారు.**



588 మార్కులు సాధించిన జ్యోత్స్నను అభినందిస్తున్న ఎంఈవో-1 పైడపునాయుడు, హెచ్‌ఎం శ్రీనివాసరావు



సీహెచ్ పోలిరాజు (574)



సీహెచ్ రోహిణి (578)

డాబాగార్డెన్స్: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. సర్కారు బడుల్లో జీవీఎంసీ ప్రకాశరావుపేట పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పాఠశాల విద్యార్థిని ఎం.జ్యోత్స్న అత్యధికంగా 588 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గానే గాక మహారాణిపేట మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిగా నిలిచింది. సీహెచ్ రోహిణి 578, చీడిపల్లి పోలిరాజు 574, రేవళ్ల లక్ష్మీ ప్రణీత 572, చాందినీ కుమార్ గుప్తా 571, కొవ్వూరు మహశ్రీ 568, గేదెల యోగేశ్వరి 566, షేక్ పీర్ జహన్ బేగం 566, కె.నూకరాజు 564, కొక్కిరి దిలీప్ 563 మార్కులు సాధించారు. సురకల నీతు 551 మార్కులు సాధించింది. 36 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు.

**దండుబజార్ ఎంపీడీ స్కూల్లో 76 శాతం.. :** జీవీఎంసీ 30వ వార్డు దండుబజార్ ఎంపీడీ స్కూల్ నుంచి 98 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 75 మంది ఉత్తీర్ణులయ్యారు. 76 శాతం ఉత్తీర్ణత సాధించారు. దుర్గా భవ్యశ్రీ అత్యధికంగా 580 మార్కులు సాధించగా.. లిఖిత ప్రణీత్ 570, జి.నిహారిణి 568 మార్కులు సాధించారు.

**క్వీన్ మేరీ పాఠశాలలో..**

డాబాగార్డెన్స్: ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాలలో 212 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 111 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో వి.అక్షయ 577 మార్కులు సాధించింది. 16 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

**ఎంజీఎం హైస్కూల్లో 48.6 శాతం**

అల్లిపురం: డాబాగార్డెన్స్‌లోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పడిపోయింది. పాఠశాల నుంచి 113 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 55 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. వారిలో బాలురు 68 మందికి గాను 36 మంది, బాలికలు 45 మందికి గాను 22 మంది ఉత్తీర్ణులయ్యారు. 48.60 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీ నాగభూషణం తెలిపారు. వారణాసి దీపిక 538, గొందేసి యర్రమ్మ 532, ఒమ్మి ఛాందిని 523 మార్కులు సాధించారు.

### ఎంవీడీఎం హైస్కూల్లో ..





దాసరి దీవెన





పవన్‌కుమార్

జగదాంబ: పాతనగరం 39వ వార్డు ఎంవీడీఎం హైస్కూల్ నుంచి 111 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా, 53 మంది ఉత్తీర్ణులయ్యారు. 47.7 శాతం ఉత్తీర్ణత సాధించారు. బడే రోహిత్ 580 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలవగా, 556 మార్కులతో దాసరి దీవెన, 549 మార్కులతో వాసుపల్లి పవన్‌కుమార్ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. 500 పైబడ్డ తొమ్మిది మంది విద్యార్థులు మార్కులు సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్‌వీ శేషకుమారి అత్యధిక మార్కులు సాధించిన రోహిత్‌కు స్వీట్ తినిపించి, అభినందించారు.



580 మార్కులు సాధించిన రోహిత్‌కు స్వీట్ తినిపిస్తున్న ప్రిన్సిపాల్ శేషకుమారి

## క్లుప్తంగా

### ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకమాంబ అమ్మవారికి భక్తులు బుధవారం స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్ గణపతి పూజ అనంతరం , అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రతి బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బిందెలతో అమ్మవారికి పసుపు నీళ్లతో అభిషేకం చేయడం ఆచారంగా వస్తున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### నిరాశ్రయులకు వస్త్రాల పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న చర్చి ప్రతినిధులు

డాబాగార్డెన్స్: బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్ స్థాపకుడు అథనాసియస్ యోహాన్ జ్ఞాపకార్థం బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాతపోస్టాఫీస్ సమీపాన గల మత్స్యకార కల్యాణ మండపంలో ఆయన పేరిట బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్ టౌన్‌హాల్ ప్రతినిధులు 50 మంది నిరాశ్రయులకు దుస్తులు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైజాగ్ డయోసెషన్ ప్రతినిధి బిషప్ గ్రేస్ జోసెఫ్, థామస్ సిరియాక్ చర్చ్ ప్రతినిధి ఫిలిప్ థామస్, వైజాగ్ మిషన్ ప్రొవిన్స్ వికర్ ప్రతినిధి ఫాదర్ నిరీక్షణరావు, డాక్టర్ నిరీక్షణ్‌పాల్, విశాఖ జిల్లా సేవకులు, సంఘ సభ్యులు పాల్గొని అథనాసియస్ యోహాన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

### కాలినడకన తిరుపతి వెళ్లొచ్చిన సాగర్



నగరానికి చేరుకున్న బెహరా విద్యాసాగర్

అల్లిపురం: గోవింద నామస్మరణతో గత నెల 6వ తేదీన వెంకటేశ్వరమెట్ట, బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి తిరుపతి కాలినడకన బయల్దేరి వెళ్లిన అల్లిపురానికి చెందిన బెహరా విద్యాసాగర్ మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. ఆయనను స్నేహితులు, కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతించారు.విద్యాసాగర్ మాట్లాడుతూ 47 రోజుల పాటు సాగిన పాదయాత్రలో అనేక దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు సందర్శించినట్లు చెప్పారు.

### రాంజీ ఎస్టేట్ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని వినతి



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామపెద్దలు, స్థానిక నాయకులు

కంచరపాలెం: కంచరపాలెం పరిధిలోని కొండవాలు ప్రాంతం రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి ఉన్నత పాఠశాలగా మార్చాలని కోరుతూ బీజేపీ నాయకుడు గుణుపూడి అరుణ్‌బాబు, స్థానికులు బుధవారం డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. దీంతో ఆయన రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు వినతులు అందించారు. తమ పిల్లలు ఉన్నత చదువులకు జాతీయ రహదారి దాటి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా డీఈవో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ సమస్యను కలెక్టర్, ఆర్జేడీకు నివేదిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం దొరబాబు, వార్డు అధ్యక్షురాలు జి.అరుణ, ఇన్‌చార్జి రాజారావు, చిన్నా, సంఘం అధ్యక్షుడు కనకరాజు, శంకరరావు, అంబేడ్కర్ ఎస్టేట్ గ్రామ పెద్దలు సవరపు జయకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పవన్ నియోజకవర్గంలోనే దళితుల సాంఘిక బహిష్కరణ

- బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు
- మే 5న 'చలో విజయవాడ'

అల్లిపురం: సనాతన ధర్మమే తన అభిమతం అని చెప్పుకొంటున్న పవన్‌కల్యాణ్ సొంత నియోజకవర్గంలోనే దళితులను సాంఘిక బహిష్కరణ చేయడం సిగ్గుచేటని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు అన్నారు. దీనిపై పవన్ మాట్లాడరా అని ప్రశ్నించారు. డాబాగార్డెన్స్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తెనపల్లిలో అంగన్‌వాడీ దళిత మహిళపై టీడీపీ నాయకుడి లైంగిక వేధింపులు, రాజంపేటలో మాదిగ పల్లె కనపడకుండా టీడీపీ రియల్ ఎస్టేట్ దందా జరుగుతోందన్నారు. ఇటువంటి సమస్యలపై చొరవ చూపి ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సంఘాలు, ఇతర సంఘాలను కలుపుకొని మే 5వ తేదీన మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో బహుజన సేన రాష్ట్ర నాయకులు గిన్నెల మనోహరరెడ్డి, ఓంకార్, ఏపీ అధ్యక్షుడు, నాయకులు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించిన వారిపై కేసు పెట్టాలి

అల్లిపురం: కులం పేరుతో దూషించారని వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయిస్తే కనీసం కేసు కూడా పెట్టలేదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు అన్నారు. ఈ మేరకు బుధవారం డాబాగార్డెన్స్, అంబేడ్కర్ విగ్రహం వద్ద కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టౌన్ కొత్తరోడ్డు దగ్గర ఉన్న ఎంఎస్ఎన్ టెక్స్‌టైల్స్ షాపులో రామకృష్ణ అనే వ్యక్తి సుమారు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నారన్నారు. సుమారు నాలుగు నెలల క్రితం యజమాని, అతని కుమారుడు కలసి రామకృష్ణతో గొడవపడి కులం పేరుతో తిట్టి, అవమానించారని ఆరోపించారు. దీనిపై బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా బాధితునికి న్యాయం జరగలేదన్నారు. తక్షణమే షాపు యజమానిపై అట్రాసిటీ కేసు పెట్టి, బాధితునికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కేవీపీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## అధినేతకు ఆత్మీయ కానుక



జగన్‌మోహన్‌రెడ్డికి బైబిల్‌లోని పరిశుద్ధ వాక్యాన్ని జ్ఞాపికగా అందజేస్తున్న జాన్‌వెస్లీ, భీశెట్టి ప్రసాద్



జగన్‌మోహన్‌రెడ్డితో కనకల ఈశ్వర్

డాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, 42వ వార్డు పార్టీ నాయకుడు భీశెట్టి ప్రసాద్ బుధవారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. బైబిల్‌లోని పరిశుద్ధ వాక్యాన్ని జ్ఞాపికగా అందజేశారు. నూతనంగా నియమితులైన విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుతో కలిసి పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి తెలిపినట్టు జాన్‌వెస్లీ పేర్కొన్నారు.

**మర్యాదపూర్వక కలయిక**

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నాగవంశం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కనకల ఈశ్వర్ బుధవారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు.

## స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ రద్దు చేయాలి

- కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలి
- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ డిమాండ్
- 1475వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ రద్దు నిర్ణయాన్ని కేంద్రం పార్లమెంటులో ప్రకటించాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు బి .పద్మ డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపి, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1475వ రోజుకి చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ప్యాకేజీ ఇచ్చి, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు కుట్ర పన్నిందన్నారు. ఈ కుట్రను టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీ డబ్బును ప్లాంట్ ఉత్పత్తికి, యంత్రాలకు, ముడి సరకులకు, కార్మికుల జీతభత్యాలకు చెల్లించకుండా రూ.1140 కోట్లు బ్యాంకు అప్పులు చెల్లించారని తెలిపారు. ఇందులోనే రూ. 500 కోట్ల రూపాయలు జీఎస్టీ పేరుతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుని, రూ.6700 కోట్లు ఇతర అప్పులు తీర్చగా మిగిలింది 3 వేల కోట్లు అని వివరించారు. స్టీల్‌ప్లాంట్‌లో 1100 మంది పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపుతున్నారని, కాంట్రాక్ట్ కార్మికులను 5400 మందిని తొలగించేందుకు సిద్ధపడ్డారని అన్నారు. ఇప్పటికే 960 మంది పాసులు రెన్యువల్ చేయకుండా, విధులకు హాజరు కాకుండా నిలిపి వేశారని తక్షణమే కాంట్రాక్ట్ కార్మికులందరినీ విధుల్లో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ తదితరులు

**ముఖ్యమంత్రికి ప్లాంట్‌పై ఉన్న ప్రేమ ఇదేనా?**

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, అనకాపల్లి జిల్లాలో ఇంకా నిర్మాణం కాని ఆర్సెలర్ మిట్టల్ కంపెనీకి సొంత గనులు కేటాయించమని మోదీని రాష్ట్ర ముఖ్యమంత్రి అడగడం చూస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ పై ఆయనకు ఉన్న ప్రేమ అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు. 8500 మంది నిర్వాసితులందరికీ తక్షణమే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు కె.మణి, కె.కుమారి, బొట్టా ఈశ్వరమ్మ, వి.ప్రభావతి, ఎల్.కామేశ్వరి, స్వర్ణలత, పి.శారద, సింహాద్రప్పడు మాస్టారు, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానానికి వాసుపల్లి వితరణ



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 39వ వార్డు కన్వేయర్ బెల్ట్ సమీపంలోని నూకాలమ్మ ఆలయంలో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. ఆశీల్‌మెట్ట సమీపాన గల వాసుపల్లి కార్యాలయంలో బుధవారం ఆలయ ప్రతినిధులకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పీపీ రావు, గంగరాజు, నాయుడు, నర్సింగరావు, రేఖనాయుడు, సత్యవతమ్మ, మాధురి తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాం మృతులకు సీపీఎం నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, ప్రజలు

డాబాగార్డెన్స్: కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సీపీఎం కొవ్వొత్తులతో నివాళులర్పించింది. జగదాంబ జంక్షన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొని, మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. దాడిలో విశాఖపట్నంకు చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి మరణించడం ఎంతో ఆందోళన కలిగించిందన్నారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మాట్లాడుతూ ఈ దాడిని పిరికిపందల చర్యగా పేర్కొన్నారు. నిత్యం వేలాది మందితో రద్దీగా ఉండే పహల్గాం పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదులు ఎలా చొరబడ్డారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎస్.జ్యోతీశ్వరరావు, వై.రాజు, పి.వెంకటరెడ్డి, జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు, చంద్రశేఖర్, అనపర్తి అప్పారావు, వెంకట్రావు, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా వ్యాక్సినేషన్

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

అల్లిపురం: వ్యాధి నిరోధక టీకాలను ప్రణాళికాబద్ధంగా వేయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. కొబ్బరితోట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించిన ఆయన సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్‌సీడీ 3.0, అభ ఐడీ జనరేషన్‌ను క్షేత్ర స్థాయిలో సందర్శించి, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. సమీక్ష సమావేశంలో ఓపీ, ఐపీ, ల్యాబ్ టెస్టులు, సాధారణ ప్రసవాలు, అలాగే ఎన్‌సీడీ సర్వే, అభ ఐడీ శతశాతం, ఆర్‌సీహెచ్ రిజిస్ట్రేషన్లు, కేపీఐ ఇండికేటర్ల గురించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ఆశ కార్యకర్తలు ఏఎన్ఎంలతో కలిసి గర్భిణులకు టీటీ వ్యాక్సిన్, ఐరన్ మాత్రలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో నాగభూషణం, ఆరోగ్య కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొబ్బరితోట ఆరోగ్య కేంద్రంలో సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

## తోట పద్మావతికి అభినందనలు



తోట పద్మావతిని సత్కరిస్తున్న 33వ వార్డు నాయకులు, కార్యకర్తలు

అల్లిపురం: కూటమి ప్రభుత్వానికి ఎదురు నిలబడి, ఏ ప్రలోభాలకు లొంగకుండా ఉన్న 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం 33వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ముత్తాబత్తుల రమేష్, సూర్యనాయుడు, సంతోష్, కృష్ణారెడ్డి, జగనన్న ఫ్యాన్స్ మహేంద్ర శివాజీ, మహేష్, రాజేష్ తదితరులు పాల్గొని సత్కరించారు.

## పర్యాటకులపై ఉగ్రవాద దాడి హేయం

డాబాగార్డెన్స్: జమ్ము కాశ్మీర్ పహల్గాం పర్యాటక ప్రాంతంలో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి హేయమని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐఐఈఏ) అధ్యక్షుడు వి రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత మిశ్రా సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ హింసాత్మక సంఘటనలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. అమానుష చర్యకు పాల్పడిన నేరస్తులను త్వరగా గుర్తించి, చట్టం ముందుకు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం**

సీతమ్మధార: పహల్గాం ఉగ్రదాడిని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రతినిధులు ఖండించారు. ఆశీలమెట్ట జీవీఎంసీ ఎదురుగా గల గాంధీపార్కులో బుధవారం సాయంత్రం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నితిన్ మాట్లాడుతూ ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతిని తెలిపారు. ఘటనకు కారణమైన మతోన్మాద ఉగ్రవాదులను నడిరోడ్డుపై కాల్చి చంపాలన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులను సమూలంగా నిర్మూలించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రసాద్, వెంకటేష్, ధనుష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ శ్రేణులు

## ప్రతి బుధవారం ఎలక్ట్రికల్ వ్యర్థాల సేకరణ

జగదాంబ: ప్రతి బుధవారం ఎలక్ట్రికల్ వ్యర్థాలను సేకరించేందుకు వార్డు ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరెడ్డి బుధవారం వాహనాన్ని ప్రారంభించారు. జీవీఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 31వ వార్డులో రోజువారీ జరుగుతున్న తడి-పొడి చెత్త సేకరణతో పాటు ప్రతి బుధవారం ఎలక్ట్రికల్ వేస్టేజీను కూడా సేకరించడానికి ఈ వాహనం వార్డులో తిరుగుతుందన్నారు. వార్డు ప్రజలందరూ ఈ ఎలక్ట్రికల్ చెత్తను వాహనంలో వేసేందుకు 9052722233 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.



వార్డు కార్యాలంయం వద్ద జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరెడ్డి

## సీపీఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఆరిలోవ: మే 10, 11 తేదీల్లో నగరంలోని మురళీనగర్‌లో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్‌ను సీపీఐ ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ కూడలిలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ రెహమాన్ మాట్లాడుతూ సీపీఐ మహాసభలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. నగరం చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. ఎంతో విలువైన భూములను కాపాడడానికి సీపీఐ పోరాటాలు చేస్తోందని చెప్పారు. సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆరిలోవ ప్రాంతంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులను నియమించి, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

## సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం శాంతినగర్ వద్ద జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ నేతృత్వంలో కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. రూ.1.98కోట్లతో సామాజిక భవన నిర్మాణం చేపడుతున్నట్లు డిప్యూటీ మేయర్ తెలిపారు. ఈఈ దిలీప్‌కుమార్, ఏఈ వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ జాగారపు నరేష్, స్థానిక నాయకులు గొర్లె చందు, సేనాపతి అప్పారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**శానిటరీ కార్యాలయం ప్రారంభం :** జీవీఎంసీ 48వ వార్డు బర్మాక్యాంప్ జై భారత్‌నగర్‌లో శానిటరీ కార్యాలయం, వెయింట్‌హాల్‌ను బుధవారం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు. రూ.75.95 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ గంకల కవిత తెలిపారు.

**49వ వార్డు పరిధిలో..**

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 49వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు స్థానిక కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. వార్డు పరిధిలోని రైల్వే సొసైటీ లేఅవుట్-కామాక్షి నగర్ బి.టిరోడ్డును 29.70 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్నారు. ఇదే వార్డు పరిధి మాణిక్యాంబ కాలనీలో కాలువ పునర్నిర్మాణ పనుల కోసం రూ.1.89 కోట్ల జీవీఎంసీ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు కూడా శ్రీకారం చుట్టారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అయినింటి రవికుమార్, వైఎస్సార్ సీపీ వార్డు సీనియర్ నాయకులు పిసాపాటి రవికుమార్, కూన ఢిల్లీరావు, షేక్ మస్తాన్, పిల్లి నాగరాజు, జె.ప్రశాంత్, పల్లా చైతన్య, బాబ్జీ, కె.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.